క్లుప్తంగా

ప్రసాదాల పంపిణీ



భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం తాత గుడి సెంటర్‌లోని గోవింద రాజ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో భక్త బృందం సభ్యులు భక్తులకు శుక్రవారం ప్రసాదాలు పంపిణీ చేశారు. ముక్కోటికి భద్రాద్రి వచ్చిన భక్తులకు రూ.50 వేల ఖర్చుతో ప్రసాదాలు చక్కెర పొంగలి, పులిహోరలను తయారు చేసి భక్తులు, యాత్రికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బిర్రు సుధాకర్, కార్తీకేయ బచ్చు ప్రసాద్, వెంకట సుబ్బారావు, శ్రీనివాస్, సురేంద్ర, కృష్ణ, సాకేత్ పాల్గొన్నారు.

కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్రంలో ప్రాంతీయ కొబ్బరి అభివృద్ధి బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని రైతు సంఘం నాయకులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఈ నెల 12న ఏపీలోని రావులపాలెంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్ని నిర్వహిస్తున్నారని, ఈ వేడుకలకు రాష్ట్రంలోని కొబ్బరి సాగుదారులకు ఆహ్వానాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు తరలివెళ్లి బోర్డు ఏర్పాటు డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఏంతైనా ఉందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

దుమ్ముగూడెం : దుమ్ముగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మోహన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.
చర్ల: మండలంలోని సత్యనారాయణపురం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్ కో ఏఈ వెంకటేశ్వరావు ఒక ప్రకటలో తెలిపారు. ఈ మేరకు సత్యనారాయణపురంలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో జెట్టిగూడెం, తేగడ, గోగుబాక, సత్యనారాయణపురం టౌన్ ఫీడర్లలో ఉదయం 11 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పోలీసుల వితరణ

చర్ల: మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన బట్టీగూడెంను శుక్రవారం సందర్శించిన సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి గ్రామంలో తాగునీటి పథకానికి అవసరమైన మోటార్‌ను అందజేశారు. అదేవిధంగా 40 కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు.

'కేటీఆర్‌పై నిందలు సరికాదు'

అశ్వాపురం: ఫార్ములా ఈ కారు రేసులో రాష్ట్ర ప్రభుత్వం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేస్తున్నవన్నీ నిందారోపణలు తప్ప నిజాలు కావని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు చుంచు రామ్మూర్తి, శెట్టిపల్లి శేఖర్, ఐసంపల్లి సురేష్ పాల్గొన్నారు.

సర్వేయర్‌ను నియమించాలి

మణుగూరు రూరల్: మండలంలో శాశ్వత భూ సర్వేయర్‌ను నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్ లేకపోవడంతో మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. భూ సమస్యలకు సంబంధించి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. నాయకులు మడి రమేష్, గొగ్గలి కోటి, ప్రవీణ్, మడకం ప్రవీణ్, గనిబోయిన రాము ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: గుర్తు తెలియని కారు ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన ఎలుకె వేణు, రొక్కం బాలాజీ శుక్రవారం తెల్లవారుజామున భీమునిగూడెం సమీపంలోని పొలం నుంచి ద్విచక్రవాహనంపై తమ స్వగ్రామానికి వస్తున్నారు. ముత్యాలమ్మ ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన బాలాజీ, వేణును చిట్టితల్లి అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కోటి సాక్షిగా..



దుమ్ముగూడెం: ఉత్తరద్వారంలో పర్ణశాల శ్రీ సీతారామచంద్ర సమేత లక్ష్మణస్వామి దర్శనం

ఉత్తర ద్వార దర్శనం

- వైభవంగా వైకుంఠ ఏకాదశి
- పోటెత్తిన వైష్ణవాలయాలు

ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో పోటెత్తాయి. స్వామి వారు ఉత్తర ద్వారం నుంచి దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం స్వామివారి విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు.

– సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: పర్ణశాల పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు



హాజరైన భక్తులు..



దమ్మపేట: వేణుగోపాలస్వామి ఆలయంలో..



బూర్గంపాడు: రెడ్డిపాలెం రామాలయంలో..



సారపాకలోని ఆంజనేయస్వామి మందిరంలో..



అశ్వారావుపేటరూరల్: నారాయణపురం ఆలయంలో సామూహిక వ్రతాలు..



ములకలపల్లి: భక్త అభయాంజనేయ ఆలయంలో..



చంద్రుగొండ : శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..



అన్నపురెడ్డిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో..



చర్ల: ఆర్ కొత్తగూడెంలో..

ఐఎన్‌టీయూసీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్



ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

బూర్గంపాడు: మండలంలోని సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ సూచించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం తనను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపునకు కాంగ్రెస్ శ్రేణులు కూడా సహకారం అందించాలని చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చి మెరుగైన వేతన ఒప్పందం చేయిస్తామని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డి ఉన్నారు.

లష్కర్ పోస్టులు ఆదివాసీలకు కేటాయించాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని ఇరిగేషన్ శాఖలో ఖాళీగా ఉన్న లష్కర్ పోస్టులను స్థానిక ఆదివాసీలకు కేటాయించాలని ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ అన్నారు. స్థానిక ఐటీడీఏ ఆవరణలో జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇరిగేషన్ శాఖలో ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఎమ్మెల్యేలు శ్రద్ధ తీసుకొని ఆ ఖాళీలను ఆదివాసీ నిరుద్యోగ యువతతో భర్తీ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, కృష్ణార్జునరావు, నరేష్, ప్రకాష్, వరప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతి ప్రాచుర్యానికి అవగాహన



మ్యూజియంలో వస్తువులను పరిశీలిస్తున్న సభ్యులు

భద్రాచలంటౌన్: ఏజెన్సీలో అంతరించిపోతున్న ఆదివాసీ గిరిజనుల ఆచార వ్యవహారాలు సంస్కృతి సంప్రదాయాలతో పాటు పాతకాలపు ఆదివాసీ కట్టడాలు ప్రాచుర్యంలోకి తేవడానికి గిరిజన గ్రామాల్లో సందర్శించి గిరిజనులకు అవగాహన కల్పింస్తున్నామని రైన్ వాటర్ ప్రాజెక్ట్ ఫౌండర్ సీఈఓ కల్పనా రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను సందర్శించి, మ్యూజియంలోని కోయ కళాఖండాలను వారు పరిశీలించారు. గిరిజనులు పాతకాలపు సంస్కృతికి సంబంధించిన కళాఖండాలను ఎగ్జిబిషన్ రూపంలో పర్యాటకులకు చూపడంతో పాటు వాటిని అమ్మకాలు జరిపి వాటి ద్వారా ఉపాధి పొందాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 600 బావులు వరకు తాగునీటి బావులుగా మార్చి ప్రజలు వాడుకునే విధంగా చేయడం జరిగిందని వివరించారు. గిరిజనులకు సరైన అవగాహన లేక వృథా ప్రకృతిలో దొరికే వాటిని వృథా చేసుకుంటున్నారని అందుకు వారికి అవగాహన కల్పించి జీవనోపాధికి కృషి చేయడానికి పర్యటిస్తున్నామన్నారు. నిహారిక, శ్రావణి, ఆదిత్య, వీరాస్వామి, చలపతి ఉన్నా

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

భద్రాచలంటౌన్: వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరు రహదారి భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐ సంగం వెంకట పుల్లయ్య తెలిపారు. రోడ్డుభద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం రవాణా శాఖ యూనిట్ కార్యాలయానికి వచ్చిన వాహనదారులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, సీటు బెల్ట్ లేని డ్రైవింగ్ ప్రమాదమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు.

బహుమతుల ప్రదానం



బహుమతి అందజేస్తున్న ప్రభాకర్

మణుగూరు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు శుక్రవారం ప్రిన్సిపల్ బడుగు ప్రభాకర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీఓజీ రవి, సూపరింటెండెంట్ టీఎస్ జ్యోతిరాణి, సయదిఫ్తాకర్, ఏటీఓలు కృష్ణారావు, ఏ నరసయ్య, మయ్యా శ్రీనివాసరావు, వేణుగోపాల్, రాజేందర్, పూర్ణచందర్‌రావు, నరేష్, దేవకరుణ, నవీన్ పాల్గొన్నారు.

కొండ గిరిజనులుగా గుర్తించాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని దళితులను కొండ గిరిజనులుగా గుర్తించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పాల్ రాజ్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక అయ్యప్ప కాలనీలో మాల మహానాడు కార్యకర్తల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. డేగల శివ, హుస్సేన్, శ్యామ్, వంశీ, సాయి తేజ, శ్రీశాంత్, ప్రభాకర్, సామేలు ఉన్నారు.

ఆశావర్కర్లతో వెట్టిచాకిరి..



దమ్మపేట: ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆశావర్కర్లతో వెట్టి చాకిరి చేపిస్తూ వారి సమస్యలు పరిష్కరించట్లేదని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని ఆశా వర్కర్లు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేల రూపాయలతో పాటు రూ.50 లక్షల బీమా హామీని నేటికి అమలు చేయలేదన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశంలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావుతో ఫోన్లో వారి సమస్యలు తెలియజేశారు. గడ్డం స్వామి, రామారావు, శిరోమణి, చంద్రకళ, చిన్నక్క, భాగ్య, సుజాత, విజయలక్ష్మి, సుజాత, హైమా, చెల్లెమ్మ, అన్నపూర్ణ, వీరమ్మ పాల్గొన్నారు.
దమ్మపేట: ఆశావర్కర్లకు స్థిర వేతనం అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మండలంలోని గండుగులపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, తమ ప్రభుత్వం వస్తే సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి, ఇప్పుడు పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. మోరంపూడి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, దుబ్బాక లక్ష్మి, సునీత, శారదా, తిరుపతమ్మ, నాగమణి పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: సీఐటీయూ ఆధ్వర్యంలో..

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



కరకగూడెం: మెటీరియల్‌తో విద్యార్థులు



ములకలపల్లిలో..

కరకగూడెం: విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించి ఉపాధ్యాయులకు, సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వరంగల్ ఎల్బీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ బిల్లా మదన్‌మోహన్, ఎంఈఓ గడ్డం మంజుల అన్నారు. శుక్రవారం మండలంలోని భట్టుపల్లి, కరకగూడెం, అనంతారం జెడ్పీ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. మదన్‌మోహన్ తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా ఈ మెటీరియల్ అందజేస్తున్నట్లు అధ్యాపకులు డాక్టర్ లింగంపల్లి దయానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు మోహన్ బాబు, కిరణ్, ఉపాధ్యాయులు వసంత్ కుమార్, లక్ష్మణ్, కోట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.
ములకలపల్లి: మండలపరిధిలోని పూసుగూడెం హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు చిరాగ్ ఫౌండేషన్ సహకారంతో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు పుష్పాల చందర్‌రావు, హెచ్‌ఎం భాను, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, పుష్పాల సాయి, బానోతు పత్తీలాల్, ఉపాధ్యాయులు బి నారాయణ, ఎ.సత్యనారాయణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు తక్షణమే అగ్రిమెంట్ చేయాలి

మణుగూరు టౌన్: ఏడాదిన్నరగా ఎస్ఎంఎస్ ప్లాంటులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై పరిష్కారానికి వినతిపత్రాలు ఇస్తున్నా యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని సింగరేణి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మధు అన్నారు. శుక్రవారం ప్లాంట్ ఎదుట ఆందోళన చేపట్టిన కార్మికులకు సంఘీభావం తెలిపి ఆయన మాట్లాడారు. యాజమాన్యం కాంట్రాక్టర్, కార్మికుల ప్రతినిధులతో చర్చలు జరిపి తక్షణమే అగ్రిమెంట్ చేయాలన్నారు. అనంతరం ప్లాంట్ మెనేజర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గద్దల శ్రీనివాసరావు, సత్రపల్లి సాంబశివరావు, కృష్ణయ్య, బాలకృష్ణ, రవి, సత్యనారాయణ, పూర్ణ, ముత్తారం, వెంకట్‌రెడ్డి, సర్వేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సంబురాలు



అశ్వారావుపేటరూరల్: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



చంద్రుగొండలో..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి, నారాయణపురం, మామిళ్లవారిగూడెం, అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కావడిగుండ్ల, అనంతారం, భీమునిగూడెం, సున్నంబట్టి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబురాలను నిర్వహించారు.
చంద్రుగొండ : మండలంలోని గుర్రాయిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రంగురంగుల సంక్రాంతి ముగ్గులు వేసి భోగిమంటలు, హరిదాసు వేషధారణలతో విద్యార్థులు సంబురాలు చేశారు. హెచ్‌ఎం ప్రవీణ, ఉపాధ్యాయురాలు కృష్ణకుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



దమ్మపేట: న్యాయవాదులతో కలిసి క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జడ్జి సాయి శ్రీ



మణుగూరు టౌన్: టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

దమ్మపేట: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) క్యాలెండర్‌ను దమ్మపేట కోర్టు ప్రధాన శ్రేణి న్యాయమూర్తి సాయి శ్రీ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాన్యులకు న్యాయ సాయం అందించడంలో, న్యాయవాదులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు మారం సతీష్ , సీనియర్ న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, సోమిశెట్టి శ్రీధర్, కృష్ణ ప్రసాద్, లక్కినేని నరేంద్ర, గొంది మురళి, భవాని కృష్ణ, సంధ్యారాణి, గద్దల అప్పారావు పాల్గొన్నారు.
మణుగూరు టౌన్: ప్రభుత్వం బకాయి పడ్డ ఐదు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, సత్వరమే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలుచేయాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎస్‌యూటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను హెచ్‌ఎం నాగశ్రీ ఆవిష్కరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐలయ్య, మీరాహుస్సేన్, కోశాధికారి పూనెం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు తోటకూరి విజయలక్ష్మి, సంఘ సభ్యులు వజ్జా కృష్ణమూర్తి, కుమారస్వామి, వెంకటేశ్వరరెడ్డి, జ్యోతి, బి.నరేశ్ తదితరులు ఉన్నారు.

ఇసుక తోడేస్తున్నారు..

- ముర్రేడులో యథేచ్ఛగా అక్రమ తోలకాలు



ముర్రేడు వాగులో ఇసుక తవ్వేసిన దృశ్యం



జామాయిల్ తోటలో ఇసుక నిల్వలు

ములకలపల్లి: ఇసుక అక్రమ తోలకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సీతారాంపురం శివారులోని ముర్రేడు వాడు నుంచి ప్రతీరోజూ లారీల్లో ఇసుకను బయటికు తరలిస్తున్నారు. పాల్వంచ-మండలపల్లి ఆర్అండ్‌బీ రోడ్డుకు సమీపంలో జామాయిల్ తోటలో తాత్కాలికంగా రోడ్డు వేసి, దందాకు తెరలేపారు. ముర్రేడు వాగు ఒడ్డునే జామాయిల్ తోటలో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకున్నారు. ట్రాక్టర్లలో వాగు నుండి ఇసుక తోడి ట్రాక్టర్లలో పాయింట్‌కు చేర్చి అక్కడి నుంచి లారీల్లో తరలిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ ర్యాంప్ నుంచి ఇప్పటికే సుమారు వంద లారీల ఇసుక బయటికి తరలించినట్లు సమాచారం. ఉమ్మడి పూసుగూడెం పంచాయతీ వ్యాప్తంగా ఈ దందా జోరుగా సాగుతోందని వార్తలు వినిపిస్తున్నాయి. చుట్టూ విస్తారంగా వాగులు, రాత్రివేళ జేసీబీలు, లారీలు పాల్వంచ నుంచి వస్తూ ఇసుక తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఠాణాలో 'రెవెన్యూ' ఫిర్యాదు...

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ శాఖ అధికారులు ఠాణాను ఆశ్రయించారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఫిర్యాదు కూడా చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు వాగు వద్దకు వెళ్లి పరిశీలించగా పెద్ద ఎత్తును ఇసుక తోడినట్టు గ్రహించి తవ్వకాలు, తోలకాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఆదేశాలు ఉల్లంఘించి అక్రమ దందాకు పాల్పడుతున్న తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సై కిన్నెర రాజశేఖర్‌ను సంప్రదించగా ఫిర్యాదుపై ఇచారణ చేపడతామని, తహసీల్దార్ సూచన మేరకు బైండోవర్ కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు.

ఫిర్యాదు చేశాం..

ఇసుక అక్రమార్కులపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాం. సీతారాంపురం శివారు ముర్రేడు వాగులో ఇసుక తవ్వుతున్న ప్రదేశాన్ని క్షేత్రస్థాయిలో గిర్దావర్ పరిశీలించి అక్రమ తోలకాలు నిలపివేయాలని ఆదేశించినా మార్పు రాలేదు. దీంతో ఇసుక తోలకాలు చేస్తున్న 9 మందిపై ఫిర్యాదు చేశాం.

– గుడ్ల పుల్లారావు, తహసీల్దార్, ములకలపల్లి